ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 28.02.2025 సమయం 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన మొట్ట మొదటి రక్షణ, వైమానిక పరిజ్ఞానాల ప్రదర్శన - విజ్ఞాన్ వైభవ్ 2025 ను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు ప్రారంభించారు.
2. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడంలో కేంద్రం జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.
3. శ్రీశైలం ఎడమగట్టు కాలువ (SLBC) సొరంగంలో సహాయక చర్యలను రెస్క్యూ బృందాలు ఈ రోజు మరింత వేగవంతం చేశాయి.
4. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రాధాన్యత రంగంగా భావిస్తోందని అందుకు అనుగుణంగా బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు.

Science Day

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేసిన మొట్ట మొదటి రక్షణ, వైమానిక పరిజ్ఞానాల ప్రదర్శన - విజ్ఞాన్ వైభవ్ 2025 ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు ప్రారంభించారు. దేశీయ పరిజ్ఞానంతో DRDO రూపొందించిన పలు రక్షణ, అంతరిక్ష పరిజ్ఞానాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, డాక్టర్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ తో కలిసి DRDO ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల ప్రదర్శనలో అత్యాధునిక హైపర్‌సోనిక్ క్షిపణి, అర్జున్ లాంటి యుద్ధ ట్యాంకులు, అత్యాధునిక డ్రోన్‌లు, రాడార్ల పరిజ్ఞానాలను సందర్శన కోసం ఉంచారు. భవిష్యత్ యుద్ధ పరిజ్ఞానాలనూ రక్షణ శాఖ - విజ్ఞాన్ వైభవ్ ప్రదర్శించింది. దేశ రక్షణ రంగ ఆత్మనిర్భరతను తెలియజేసి, రక్షణ ప పరిజ్ఞానాలను కెరీర్ గా స్వీకరించేందుకు యువతను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు దాదాపు 30 వేలమంది ఇంజినీరింగు, ఇతర విభాగాల విద్యార్థులు హాజరవుతారని అంచనా. రక్షణ రంగ పరిజ్ఞానాలతో వివిధ ఉత్పత్తుల తయారీలో ఉన్న దాదాపు 200 పరిశ్రమాలూ, DRDO సంస్థలూ ఒకే వేదికపై తమ అత్యాధునిక పరిజ్ఞానాలను, ఉత్పత్తులను ప్రదర్శించాయి. మార్చి మూడు వరకు మూడు రోజులపాటు అందుబాటులో ఉండే ఈ ప్రదర్శనకు సాధారణ ప్రజలను రేపు, ఎల్లుండి అనుమతిస్తారు. ఉదయం 9 గంటలనుంచి, సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా సందర్శించవచ్చు. ఇటీవల విజయవంతంగా పరీక్షించిన హైపర్‌సోనిక్ గ్లైడ్ క్షిపణి, బాలిస్టిక్ క్షిపణులు, ఉపరితలం నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణులు, ఇంకా ఆధునిక రాడార్ వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో ఇక్కడ చూడవచ్చు.

(ఎంఎస్ఎల్)

కిషన్ రెడ్డి –రేవంత్ రెడ్డి లేఖ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వడంలో కేంద్రం జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడం, నిధులు మంజూరు చేయించడం

తెలంగాణ కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి నైతిక బాధ్యత అని  అన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణపై ఏడాదిగా పలుమార్లు విజ్ఞప్తి చేసినా, కిషన్ రెడ్డికి కలిసి విన్నవించినా ఎటువంటి పురోగతి కనిపించడం లేదని అన్నారు. ఈ మేరకు కిషన్ రెడ్డికి ఈ రోజు లేఖ రాశారు. తమ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పారదర్శకంగా పాలన చేస్తున్నామని, సమాఖ్య విధానానికి పూర్తిగా కట్టుబడి ఉండి దానిని అనుసరిస్తున్నామని తెలిపారు.  తాము ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ఏవిధంగా చేయూతనిస్తారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి సంబంధించిన 1 లక్షా 63 వేల 559.31 కోట్ల రూపాయల ప్రాజెక్టుల అనుమతులు, నిధుల మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.

(డెస్క్)

బ్యాంకర్లు-ఉప ముఖ్యమంత్రి

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్లుగా ప్రయాణించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బ్యాంకర్లు అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ రోజు  హైదరాబాద్ లో  రాష్ట్రస్థాయి బ్యాంకర్ల త్రైమాసిక సమీక్ష సమావేశంలో  మాట్లాడుతూ రైజింగ్ తెలంగాణలో బ్యాంకర్ల పాత్ర కీలకమని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షేమ రంగాన్ని విస్మరించిందని, తమ ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రాధాన్యత రంగంగా భావిస్తున్నదని తెలిపారు. మహిళలతో సోలార్ విద్యుదుత్పత్తి, పెట్టుబడులకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుదారులకు అవసరమైన నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, నాణ్యమైన నిరంతరాయ విద్యుత్తు, శాంతిభద్రతలతో మంచి వాతావరణం కల్పిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ కృషి ఫలితంగా దావోస్ లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో లక్షా 80 వేల కోట్ల రూపాయల విలువ చేసే పెట్టుబడులను తెలంగాణ ఆకర్షించిందని తెలిపారు.

(పీఎన్)

SLBC సొరంగం- సహాయక చర్యలు

శ్రీశైలం ఎడమగట్టు కాలువ (SLBC) సొరంగంలో 7వ రోజు సహాయక చర్యలు, ఈ రోజు కొనసాగుతున్నాయి. రెస్క్యూ బృందాలు చర్యలను మరింత వేగవంతం చేస్తూ సొరంగంలో ముందుకు కదులుతున్నాయి. NDRF, SDRF, నేవీ, ఆర్మీ, సెంట్రల్ రైల్వే ప్లాస్మా కట్టర్, ర్యాట్ హోల్ మైనర్స్ తదితర బృందాలు సమన్వయంతో సొరంగంలో పేరుకుపోయిన బురద శకలాలను తొలగించే చర్యలు వేగవంతం చేశాయి. నిన్న రాత్రి షిఫ్ట్ లో వెళ్లిన బృందాలు, మట్టి శిఖరాలను తొలగించేందుకు ప్రత్యేకంగా మినీ జేసీబీని సొరంగంలోకి పంపి మట్టి తోడుతూ, లోకల్ మినీ రైలులో బయటకి పంపుతున్నాయి. సొరంగంలో జరుగుతున్న సహాయక చర్యల చిత్రాలను అధికారులు ఈరోజు మీడియాకు విడుదల చేశారు. సహాయక చర్యలను రాష్ట్ర ప్రకృతి విపత్తుల ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తోపాటు ఎస్పీ రఘునాథ్ గైక్వాడ్, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నారు.

(PTC నాగర్‌కర్నూల్ జిల్లా)

టీపీసీసీ-మీనాక్షి

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం ఈ రోజు హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో జరగనుంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ హాజరుకానున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జిగా నియమితులైన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన మీనాక్షి నటరాజన్ తో ఈ ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. అంతకుముందు కాచిగూడ రైల్వేస్టేషన్ లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ నాయకులతో కలిసి మీనక్షి నటరాజన్ కు ఘన స్వాగతం పలికారు .

(డెస్క్)

కుల గణన సర్వే  - మంత్రి పొన్నం ప్రభాకర్

కుల గణన సర్వే నేటితో ముగుస్తుందని, ఇంకా సర్వే లో పాల్గొనని వారు ఎన్యుమారెటర్లకు వివరాలు ఇచ్చి వెంటనే సర్వే లో పాల్గొనాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు ఓ ప్రకటనలో తెలిపారు. కుల గణన లో పాల్గొనని వారికి ప్రభుత్వం ఈ నెల 16 నుంచి నేటి వరకు చివరి అవకాశం ఇచ్చిందన్నారు. తెలంగాణ జనాభా లెక్కల్లో భాగస్వామ్యం ఉండాలంటే కుల గణన సర్వే లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.  040-211 11111 నంబర్ కు ఫోన్ చేసి తాము కుల సర్వేలో పాల్గొనలేదని తెలిపితే ఎన్యుమరేటర్లు వారి నివాసాలకు వచ్చి వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం, వార్డు ఆఫీసులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ లకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

(సిద్దిపేట జిల్లా పీటీసీ)

ఎమ్మెల్సీ- బ్యాలెట్ బాక్స్

మెదక్-నిజామాబాద్ -కరీంనగర్ -ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ నిన్న ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి నాలుగు జిల్లాల పట్టభద్రుల స్థానం కోసం 70.42% పోలింగ్ నమోదు కాగా, ఉపాధ్యాయ శాసన మండలి స్థానానికి 91.90 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమెల సత్పతి తెలిపారు. పటిష్ట భద్రత నడుమ ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ బాక్సు లను సిబ్బందిని కరీంనగర్ జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ స్టేడియంలొని స్ట్రాంగ్ రూమ్స్ కు తరలించారు.  మార్చి 3 న  కౌంటింగ్ ప్రక్రియ జరగనున్న నేపథ్యం లో పరిసర ప్రాంతాల్లో  144 సెక్షన్ విధించి గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

(పిటిసి, కరీంనగర్)

మంచిర్యాల- తాగునీటి సరఫరా

మంచిర్యాల జిల్లాలో మిషన్ భగీరథ శుద్ధి కేంద్రానికి మరమ్మత్తులు చేస్తున్న నేపథ్యంలో ఈరోజు, రేపు జిల్లాలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాలలో అంతరాయం

కలుగుతుందని మిషన్ భగీరథ డిఈ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు, జిల్లాలోని దండేపల్లి, లక్షటిపేట, హాజీపూర్, మందమర్రి, జైపూర్, భీమారం, చెన్నూరు, కోటపల్లి మండలాలతో పాటు చెన్నూరు, లక్షటిపేట మున్సిపాలిటీలు మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

(మంచిర్యాల జిల్లా)

మంచిర్యాల-వేలాల జాతర

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాల జాతరకు మూడో రోజు భక్తులు పోటెత్తారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర లోని సిరోంచా, గడ్చిరోలి ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వేలాల గుట్ట పైన స్వయంభూవుగా వెలిసిన మల్లన్నస్వామికి బోనాలు, పట్నాలతో భక్తులు మొక్కులు చెల్లిస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా 600 మంది పోలీసుల తో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు.

(పిటిసి, మంచిర్యాల జిల్లా.)

ఆసిఫాబాద్ - సైన్స్ దినోత్సవం

ఆసిఫాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఈరోజు ఘనంగా నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలతో పాటు, ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాన్ని పరీక్షించే ఉద్దేశంతో సైన్స్ ప్రాజెక్ట్ ల తయారీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి గమినియల్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న మానవ అవసరాలకు సైన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

సిరిసిల్ల-ఉపాధి హామీ

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా డిఆర్డిఓ శేషాద్రి తెలిపారు. జిల్లాలో 12 బ్లాక్ లు ఉండగా 255 గ్రామపం చాయతీల పరిధిలో 98వేల జాబ్

కార్డులు న్నాయని పేర్కొన్నారు. మార్చిలోగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు.

(పీటీసీ, సిరిసిల్ల)